# తెలుగు రాష్ట్రాల్లో అధికార భాషగా తెలుగు..



మహమ్మద్ అబ్దుల్ షాహిద్

ప్రపంచంలో విభిన్న సంస్కృతులు, మతాలు, తెగలు ఉన్నాయి. భౌగోళికంగా ప్రతి ప్రాంతానికి, ప్రతి తెగకు ప్రత్యేక భాష మరియు మాండలికాలు ఉన్నాయి.

అలాగే భారతదేశంలో కూడా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న విభిన్న మతాలు, తెగల వారు వివిధ భాషలు మరియు మాండలికాలు మాట్లాడతారు.

దక్షిణ భారతదేశంలో మాట్లాడే భాషల్లో తెలుగు భాషకు ప్రాచీన భాషలలో గుర్తింపుతో పాటు ఒక విశిష్టమైన స్థానం ఉంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

అందుకు గల కారణాలు తెలుగు భాషకు గల విలక్షణమైన లిపి, ఛందస్సు, వ్యాకరణం, ప్రత్యేక ఆభూషణాలు అదనపు అలంకారాలుగా చెప్పవచ్చు.

చక్రవర్తులు, రాజులు సామంతులు తెలుగు భాషను రాజ భాషగా, వారి రాజ్య భాషగా, పూజ్య భాషగా, అధికార భాషగా చేసుకుని రాజ్యాలను పరిపాలించారు.

అలనాటి పాలకులు కళలను, సంగీతాన్ని, సాహిత్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా వారికి తమ ఆస్థానాల్లో సముచిత స్థానాన్ని కల్పించి ప్రోత్సహించి, పోషించటం వల్ల కవులు, రచయితలు, సాహితీవేత్తలు విలువైన సాహిత్యాన్ని ప్రపంచానికి అందించారు. పుంఖాలు - పుంఖాలుగా వారసత్వంగా లభించిన ఇంతటి విలువైన సాహితీ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది.

సహస్రాధిక సంవత్సరాలు అజరామరంగా వర్ధిల్లి, తుల- తూగి అలరారిన తెలుగు భాష మరియు తెలుగు సాహిత్యం సమీప భవిష్యత్తులో కనుమరుగై పోయే భాషల చెంత చేరుతుందేమో అనే చింతన తెలుగు భాషా ప్రేమికులు, తెలుగు సాహితీ అభిమానులు, మరియు తెలుగు బంధువుల మస్తిష్కాలను తొలుస్తున్న ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానం సత్వరమే చెప్పలేకపోయినా సమస్యకు పరిష్కారం శాశ్వతంగా లభించటమే కాక తెలుగు భాషకు సజీవ భాష హోదా వస్తుందన్న భావన మనందరిలో ఉంది.

దక్షిణ భారతదేశంలోని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రాంతీయ మరియు మాతృభాష అయిన తెలుగును రాజ భాషగా, అధికార భాషగా ప్రకటిస్తే తెలుగు భాష పునర్వైభవంతో అజరామరంగా వర్ధిల్లుతుంది.

తెలుగు భాషలో భావవ్యక్తీకరణ చేసినంతగా మరే ఇతర భాషలలో వ్యక్తీకరణ చేయలేం అన్నంత సులువుగా, సౌకర్యవంతంగా, అర్ధవంతంగా, తెలుగు భాష ఉంటుందనే భావన మనందరిలో ఉంటుంది.

ఇంతటి ప్రత్యేకతలు కలిగిన సుందరమైన తెలుగు భాష, మధురమైన మన మాతృభాష ప్రపంచీకరణ నేపథ్యం, ఆంగ్ల భాషపై మోజు, ఇతర భాషలపై ఆంగ్ల గుత్తాధిపత్యం తెలుగు భాషను అంతరించిపోయే భాషల సరసన చేరుస్తుందేమో అన్న భయం కలుగుతుంది.

ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల రచన, కార్యక్రమాల రూపకల్పనకై ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు భాషా ప్రేమికులు, తెలుగు సాహితీ అభిమానులు విస్తృత స్థాయిలో మేధోమథనం చేసి ప్రతినిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

తెలుగు భాషా వికాసం మన ఇంటి నుండే ప్రారంభం కావాలి. ఇంటి ఆవరణలో కమ్మ నైనా మన మాతృభాష తెలుగును అనునిత్యం మాట్లాడుతూ పిల్లల చేత స్వచ్ఛమైన తెలుగులో సరియైన ఉచ్చారణతో మాట్లాడిస్తూ ఉంటే భాషపై పట్టు సాధించేలా చేయవచ్చు. మన ఇరుగు - పొరుగు వారితో, అవసరమైతే తప్ప పర భాషలో సంభాషించ కూడదు. సెలవు దినాల్లో, తీరిక సమయాల్లో తెలుగు భాషా వికాసానికి దోహదం పడే కార్యక్రమాల రూపకల్పన చేయాలి. ఉదాహరణకు దినపత్రికలు, కథల పుస్తకాలు, నీతి కథలను బోధిస్తూ చదివిస్తూ వారితో చెప్పిస్తూ భాషపై ఆసక్తిని పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాలి. వేసవి సెలవుల వారాంత సంధ్యా సమయాల్లో తెలుగు భాషా వికాసానికి సంబంధించి వివిధ రకాల ఆటా - పాటల కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ప్రశంసించి, ప్రోత్సహిస్తూ పోటీలో నెగ్గిన వారికి బహుమతులను అందించి సత్కరించాలి.

పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు వారి వారి స్థాయిలకు అనుగుణంగా ఆటా-పాటా, ఉక్త లేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, తెలుగు పదాలనే ఉపయోగిస్తూ తెలుగులో ప్రసంగాలు చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తే తెలుగు భాషా వికాసం జరుగుతుంది.

ఇంతే కాకుండా ప్రభుత్వాలు ప్రాథమిక విద్యను ఖచ్చితంగా మాతృభాషలోనే అభ్యసించాలి అనే నిబంధనను కఠిన తరం చేయాలి. పాఠశాల స్థాయిలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు, కళాశాల స్థాయిలో ఇంటర్ మరియు డిగ్రీ వరకు ద్వితీయ భాష మరియు ఐచ్ఛికంగా ఉన్న తెలుగు భాషను ప్రథమ భాషగా బోధించేలా రెండు తెలుగు రాష్ట్రాలు చొరవ చూపాలి. ప్రాంతీయ మరియు జిల్లా కోర్టులలో తీర్పులు తెలుగులోనే వెలువరించే విధంగా సంస్కరణలు తీసుకురావాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుంటూ తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేయాలి. చరవాణుల్లో సందేశాలను తెలుగులో భాషలోనే పంపించుకోవాలి. సామాజిక, ప్రసార మాధ్యమాల్లో తెలుగు భాష వికాసానికి సంబంధించిన కార్యక్రమాలు నిత్యం ప్రసారం చేస్తూ చైతన్య పరుస్తూ ఉండాలి. ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల్లో కార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, తెలుగులోనే జరపాలి అనే నిబంధనను కఠిన తరం చేస్తే ఖచ్చితంగా తెలుగు భాష వికాసం మరియు తెలుగు భాషాభివృద్ధితో తెలుగు భాషకు పునర్వైభవం రావటమే కాకుండా కమ్మనైన అమ్మభాష తెలుగును సజీవంగా శాశ్వతంగా భవిష్యత్ తరాలకు అందించవచ్చు.

తెలుగు భాషలో మాట్లాడితే ఆత్మన్యూనతగా భావించే ప్రతి తెలుగువాడు నా మాతృభాష తెలుగు, నేను తెలుగు వాడిని అని సగర్వంగా కొండంత విశ్వాసంతో చెప్పకోగలిగేలా తెలుగులో మాట్లాడుదాం, తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేద్దాం! *